

## హీరానందానీకి లాగిన్ నేనే ఇచ్చా: మొయిత్రా

న్యూఢిల్లీ : పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగేందుకు ముడుపులు తీసుకొన్నారన్న వివాదం టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాను వెంటాడుతున్నది. తాజాగా ప్రశ్నలు పోస్టు చేసేందుకు తన పార్లమెంట్ లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ వివరాలను తన స్నేహితుడు, వ్యాపారవేత్త దర్శన్ హీరానందానీకి ఇచ్చినట్టు మొయిత్రా అంగీకరించారు. అయితే సుప్రీంకోర్టు న్యాయవాది జై అనంత్ దెహద్రాయ్ సీబీఐకి ఇచ్చిన ఫిర్యాదులో ఆరోపించినట్టుగా తాను హీరానందానీ నుంచి డబ్బులు తీసుకోలేదని తాజాగా ఓ ఇంగ్లిష్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. తాను మారుమూల నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నందున తాను లాగిన్ వివరాలను ఇతరులతో కూడా పంచుకొన్నానని పేర్కొన్నారు. తనకు ఎప్పటికప్పుడు ఓటీపీ వస్తుందని, ప్రశ్నలను ఒక టీమ్ పోస్టు చేస్తుందని చెప్పారు. .

## షిండే నాయకత్వంలోనే ఎన్నికలకు వెళ్తాం: బీజేపీ

పాల్ఘర్ : రాష్ట్రానికి నాయకత్వం వహించేందుకు 'నేను మళ్లీ వస్తా' అంటూ మహారాష్ట్ర మాజీ సీఎం, బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ వ్యాఖ్యలు ఎక్స్‌లో పోస్టు కావడంపై పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ భవాంకులే వివరణ ఇచ్చారు. ఆ పాత వీడియోను ఉత్సాహవంతుడైన పార్టీ కార్యకర్త ఒకరు దాన్ని పోస్టు చేశారని, దానిని తప్పుగా అర్థం చేసుకోవద్దని అన్నారు. శుక్రవారం పాల్ఘర్ జిల్లా పర్యటనలో మీడియాతో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికలకు సీఎం ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలోనే వెళ్తామన్నారు.

## రాజస్థాన్‌లో వారసత్వ రాజకీయాలు

**బంధువులకే 26 సీట్లను కేటాయించిన కాంగ్రెస్, బీజేపీ**

జైపూర్: తమ వారసులు, బంధువులను రాజకీయాల్లోకి దింపడం, టిక్కెట్లు కేటాయించడంలో ఏ పార్టీ మినహాయింపు కాదు! రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్, బీజేపీ సీనియర్ నేతలు టిక్కెట్ల కేటాయింపుల బంధుప్రీతి చూపించుకున్నారు. 81 సీట్లలో కొందరు నేతలకు గట్టి పట్టు ఉంది. అందులో 40 సీట్లలో దశాబ్దాల తరబడి కొన్ని కుటుంబాలే అధికారం చెలాయిస్తున్నాయి. ఈసారి రెండు పార్టీల సీనియర్ నేతలు 26 టిక్కెట్లను తమ వారసులు, బంధువులకు కేటాయించారు. ఇలా బీజేపీలో 11, కాంగ్రెస్‌లో 15 మంది టికెట్లు పొందారు.

## అసమ్మతా? అదేం లేదే!

**కర్ణాటక సీఎం సిద్ధరామయ్య**

బెంగళూరు: తమ పార్టీలో తీవ్ర అసమ్మతి ఏమీ లేదంటూ సమర్థించుకునేందుకు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ప్రయత్నించారు. సిద్ధరామయ్య ప్రభుత్వం రెండున్నరేళ్లు మించి ఉండదని, తర్వాత శివకుమార్ సీఎం అవుతారంటూ సొంత పార్టీ నేత ఒక పక్క ఆరోపణలు చేస్తుండగా అలాంటిదేమీ లేదంటూ సిద్ధరామయ్య పేర్కొన్నారు. పైగా 'ఆపరేషన్ కమలం' పేరుతో తన ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని ఆరోపిస్తూ.. అలాంటి ప్రయత్నాలు వృథాయేనని శనివారం మీడియాకు స్పష్టం చేశారు.

## మరాఠా రిజర్వేషన్ల సాధనకు ఆమరణ దీక్షలు

ముంబై, అక్టోబర్ 28: తమ డిమాండ్ల సాధనకు ఆదివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆమరణ నిరాహార దీక్షలు ప్రారంభించాలని మరాఠా రిజర్వేషన్ ఉద్యమ నేత మనోజ్ జారంగే పాటిల్ శనివారం పిలుపునిచ్చారు. ప్రభుత్వం రిజర్వేషన్లపై ప్రకటన చేస్తామంటూ హామీ ఇచ్చి మాట తప్పినట్టు ఆరోపించారు. ఆదివారం నుంచి ప్రారంభమయ్యే దీక్ష దేశంలోనే గొప్ప ఉద్యమం కావాలని పిలుపునిచ్చారు. మరాఠాల రిజర్వేషన్ కోసం దయచేసి ఎవరూ బలవన్మరణాలకు పాల్పడవద్దని, శాంతియుత మార్గాల ద్వారా మన డిమాండ్లను పరిష్కరించుకుందామని కోరారు.

# భారత తీరం.. అదానీ పరం!

- ప్రధాని మోదీ ఆప్త మిత్రుడి చేతిలో 14 పోర్టులు
- ప్రతీ 500 కిలోమీటర్ల దూరంలో ఒక అదానీ పోర్టు
- మొత్తం కార్గోలో 24 శాతం నిర్వహణ అదానీ గ్రూప్‌దే
- ఒక ప్రైవేట్ కంపెనీకి గంపగుత్తగా పోర్టులు కట్టబెట్టడం ముప్పేనంటున్న ప్రభుత్వ మాజీ అధికారులు, నిపుణులు
- ఇప్పటికే డ్రగ్స్ మాఫియాకు అడ్డాగా మారిన ముంద్రా
- 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పరిశోధనాత్మక కథనంలో వెల్లడి

*'దేశ ప్రాదేశిక జలాల రక్షణలో కీలకంగా వ్యవహరించే పోర్టులు గంపగుత్తగా ఓ ప్రైవేటు వ్యక్తి ఆధీనంలో ఉండటం ఎంతమాత్రం మంచిది కాదు. దీంతో దేశ భద్రతే ప్రమాదంలో పడొచ్చు'.. రక్షణ రంగానికి చెందిన పలువురు నిపుణులు గత కొంత కాలంగా వ్యక్తం చేస్తున్న ఆందోళన ఇది. దీనికి కారణం..మోదీ సర్కారు దేశంలో 14 పోర్టులను అదానీ గ్రూప్‌నకు కట్టబెట్టడం.*



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): 2001లో గుజరాత్‌లోని ముంద్రా పోర్టును మాత్రమే నిర్వహించే అదానీ గ్రూప్ కింద.. ప్రస్తుతం దేశంలోని 14 పోర్టులు, టెర్మినల్స్ ఉన్నాయి. గడిచిన 10 ఏండ్ల వ్యవధిలో ఆ గ్రూప్ ఏకంగా ఆరు పోర్టులను చేజిక్కించుకొన్నది. అంతేకాదు, దేశీయంగా జరిగే మొత్తం కార్గో వ్యాపారంలో 24 శాతం వాటా అదానీదే. ఈ మేరకు 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' దినపత్రిక పరిశోధనాత్మక కథనాన్ని వెలువరించింది. పోర్టులు, టెర్మినల్స్‌లో అదానీ గుత్తాధిపత్యం వహించడంపై ప్రభుత్వానికి చెందిన ముగ్గురు సీనియర్ అధికారులు ఆందోళన వ్యక్తం చేసినట్టు తెలిపింది. నరేంద్రమోదీ గుజరాత్ సీఎంగా, ఆ తర్వాత దేశ ప్రధానిగా మారిన తర్వాత అదానీ వ్యాపార సామ్రాజ్యం అనూహ్యంగా వృద్ధిచెందిందన్న విమర్శలు ఉన్నాయి. పోర్టులన్నీ ఒకే కంపెనీ చేతిలో ఉండిపోతే పలు నష్టాలు ఉంటాయని ప్రభుత్వాధికారులు, నిపుణులు అంటున్నారు.

- కంపెనీ నిర్ణయించిన ధరకే కార్గో నిర్వహణ ఖర్చులను షిప్పింగ్ కంపెనీలు చెల్లించాల్సి వస్తుంది.
- పోటీతత్వం లేకపోవడంతో సేవల్లో నాణ్యత కొరవడుతుంది.
- గుత్తాధిపత్యం పెరిగి చిన్న కంపెనీలకు పోర్టుల నిర్వహణ అవకాశం దక్కకపోవచ్చు.

**దేశంలోని మొత్తం కార్గోలో అదానీ గ్రూపు వాటా 24%**

### డ్రగ్స్ మాఫియాకు అడ్డాగా

అదానీ పోర్టులో మూడు సార్లు పెద్దయెత్తున మాదకద్రవ్యాలు (మొత్తంగా 3,375 కిలోల హెరాయిన్.. విలువ రూ. 25 వేల కోట్లు) దొరికాయి.

### ఎవరి నుంచి అదానీ గ్రూప్ టేకోవర్ చేసిందంటే..

| పోర్టు పేరు | పూర్వకంపెనీ |
|---|---|
| కృష్ణపట్నం | నవయుగ |
| కట్టుపల్లి | ఎల్ అండ్ టీ |
| తునా | కాండ్లా పోర్టు ట్రస్టు |
| దహేజ్ | పెట్రోనెట్ ఎల్ఎన్జీ, ఓఎన్జీసీ |
| హజీరా | షెల్‌గ్యాస్ బీవీ, టోటల్ గాజ్ |
| దిఘీ | జేఎన్‌పీటీ |
| మోర్ముగోవా | మోర్ముగోవా పోర్టు ట్రస్టు |
| విజింజామ్ | – |
| ఎన్నూర్ | కామరాజర్ పోర్టు |
| వైజాగ్ టెర్మినల్ | విశాఖపట్నం పోర్ట్ అథారిటీ |
| ముంద్రా | – |
| కరైకల్ | – |
| గంగవరం | డీవీఎస్ రాజు గ్రూప్ |
| దామ్రా | లార్సెన్ అండ్ టర్బో, టాటాస్టీల్ |

### ఇది తెలుసా?

- దేశ తీర రేఖ పొడవు 7,517 కిలోమీటర్లు. ఇందులో ప్రతీ 500 కిలోమీటర్లకు ఒక అదానీ పోర్టు లేదా టెర్మినల్ దర్శనమిస్తుంది.
- గడిచిన 10ఏండ్లలో అదానీ పోర్టులు నిర్వహించే కార్గో సామర్థ్యం నాలుగు రెట్లు పెరిగింది.
- కార్గో విషయంలో అదానీ పోర్టులో వార్షిక వృద్ధి రేటు 14 శాతంకాగా, భారత ప్రభుత్వం నిర్వహించే పోర్టుల వృద్ధి రేటు 4 శాతం మాత్రమే.
- నౌకల టర్న్ అరౌండ్ టైమ్ అదానీ పోర్టుల్లో 0.7 రోజులుగా ఉంటే, ప్రభుత్వ ఆధ్వర్యంలోని పోర్టుల్లో 2 రోజులుగా ఉంది. (టర్న్ అరౌండ్ టైమ్ ఎంత తక్కువగా ఉంటే ఆ పోర్టుకు అన్ని కార్గో ఆర్డర్లు ఎక్కువగా వస్తాయి)

### ఆందోళనకరమే!

*2013లో అదానీ పోర్టుల కార్గో నిర్వహణ షేర్ 10 శాతం కంటే తక్కువ, ప్రస్తుతం 24 శాతానికి చేరింది. ప్రభుత్వం నిర్వహణలో ఉన్న పోర్టుల కార్గో షేర్ 58.5 శాతం నుంచి 54.5 శాతానికి పడిపోయింది.*


– కేంద్ర ఆర్థిక శాఖలోని ఓ అధికారి

### డ్రాపౌట్ నుంచి కుబేరుడిగా


*కళాశాల చదువును మధ్యలోనే ఆపేసిన అదానీ తొలుత వజ్రాల ట్రేడింగ్‌లోకి దిగారు.మోదీ ఆ రాష్ట్ర సీఎంగా ఉన్నప్పుడు, 2014లో పీఎంగా మారినప్పటినుంచి అదానీ ఆస్తులు రాకెట్ వేగంతో దూసుకెళ్లడం గమనార్హం. బొగ్గు వ్యాపారంతో దశ తిరిగింది.*

### పదేండ్లలో అదానీ పోర్టుల సామర్థ్యం ఎలా పెరిగిందంటే?

(మిలియన్ మెట్రిక్ టన్నుల్లో )




### కార్గోలో అదానీ షేర్ ఇలా (మిలియన్ టన్నుల్లో)




## ఉల్లి ఎగుమతులపై ఆంక్షలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 28: దేశంలో ఉల్లిగడ్డల ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో ఎగుమతులపై ఆంక్షలు విధిస్తూ కేంద్ర ప్రభుత్వం శనివారం కీలక నిర్ణయం తీసుకొన్నది. ఉల్లి కనీస ఎగుమతి ధర(ఎంఈపీ)ను టన్నుకు 800 డాలర్లుగా నిర్ణయించింది. ఇది ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు అమల్లో ఉంటుందని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో తెలిపింది. ధరల నియంత్రణతోపాటు దేశీయంగా ఉల్లిగడ్డల అందుబాటును పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకొన్నట్టు తెలిపింది. కాగా, తగిన సరఫరా లేకపోవడంతో దేశ రాజధాని ఢిల్లీలో ఉల్లి ధర కిలో రూ.65-80 పలుకుతున్నది.

## స్వల్పంగా తగ్గనున్న ఖరీఫ్ వరి ఉత్పత్తి

న్యూఢిల్లీ : ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా పండించే వరి 2023-24లో అంతకు ముందు ఏడాది కన్నా 3.79 శాతం తగ్గుతుందని కేంద్ర వ్యవసాయ శాఖ విడుదల చేసిన నివేదిక తెలిపింది. 2022-23లో 110.5 మిలియన్ టన్నుల వరి ఉత్పత్తి కాగా, 2023-24లో 106.31 మిలియన్ టన్నుల వరి ఉత్పత్తి అవుతుందని అంచనా వేసింది. సాగు విస్తీర్ణం పెరిగినప్పటికీ, వర్షపాతంలో అసమానతల వల్ల ఉత్పత్తి తగ్గుతుందని వివరించింది. ఈ ఏడాది పెసర, కంది, సోయాబీన్, చెరకు ఉత్పత్తి కూడా తగ్గుతుందని చెప్పింది.

## ముకేశ్ అంబానీకి బెదిరింపు మెయిల్

ముంబై, అక్టోబర్ 28: రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీకి హత్య బెదిరింపులు వచ్చాయి. రూ.20 కోట్లు ఇవ్వాలని, లేకుంటే కాల్చి చంపేస్తామని దుండగులు ఆయనకు ఈ మెయిల్ సందేశం పంపారని ముంబై పోలీసులు శనివారం వెల్లడించారు. ముకేశ్ అంబానీ భద్రతా అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ మెయిల్ పంపిన దుండగుడిని గుర్తించేందుకు చర్యలు ప్రారంభించామని చెప్పారు.

## రాజస్థాన్‌లో భారీగా ఎన్నికల తాయిలాలు


**రూ.214 కోట్ల విలువైన మద్యం, డ్రగ్స్, నగదు సీజ్**

జైపూర్, అక్టోబర్ 28: రాజస్థాన్‌లో ఉచితాలు, తాయిలాలతో ఓటర్లను తమ వైపునకు తిప్పుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. దీంతో రాష్ట్రంలో పెద్ద ఎత్తున మద్యం, నగదు, డ్రగ్స్, బంగారు ఆభరణాలు పోలీసులకు పట్టుబడుతున్నాయి. కోడ్ అమల్లోకి వచ్చిన అక్టోబర్ 9 నుంచి రాష్ట్రంలో పోలీసులు సీజ్ చేసిన ఎన్నికల ఉచితాల విలువ రూ.214 కోట్లు ఉంటుందని ఐజీ వికాస్ కుమార్ శనివారం మీడియాకు తెలిపారు. రూ.60 కోట్ల విలువజేసే మాదక ద్రవ్యాలు పట్టుబడ్డాయని చెప్పారు. 'ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన అక్టోబర్ 9 నాటి నుంచి రూ.25 కోట్ల అక్రమ నగదు, 20 కోట్ల మద్యం, రూ.20కోట్ల బంగారం పట్టుబడింది. ఇదంతా ఎన్నికల్ని ప్రభావితం చేసేందుకే. పెట్రోల్, డీజిల్, ఎరువులు..మొదలైనవి కూడా సీజ్ చేశాం' అని ఐజీ వికాస్ కుమార్ వివరించారు.

## విపక్ష కూటమిలో ఎవరికి వారే!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): విపక్ష 'ఇండియా' కూటమిలో ఐక్యత కనిపించడం లేదు. మధ్యప్రదేశ్‌లో అధికార బీజేపీకి కాంగ్రెస్ ప్రధాన పోటీదారుగా ఉండగా.. ఎస్పీ, ఆప్ కూడా బరిలోకి దిగాయి. ఇక తాము కూడా ఎన్నికల్లో పోటీచేస్తున్నట్టు బీహార్ సీఎం నితీశ్ కుమార్ పార్టీ జేడీయూ తాజాగా ప్రకటించింది. 10 స్థానాల్లో అభ్యర్థులను కూడా రంగంలోకి దించింది. సీట్ల పంపకంపై కాంగ్రెస్‌తో చర్చలు విఫలమైనందునే తాము పోటీ చేస్తున్నట్టు జేడీయూ నేత కేసీ త్యాగి పేర్కొన్నారు.




## మధ్యప్రదేశ్ సీఎంతో మిర్చి బాబా ఢీ

భోపాల్: మధ్యప్రదేశ్‌లో సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్‌పై గురిపెట్టిన సమాజ్‌వాదీ పార్టీ ఆయన పోటీ చేస్తున్న బుద్నీలో వివాదాస్పద స్వామిగా పేరొందిన మహామండలేశ్వర్ స్వామి వైరాగ్యానంద్ గిరి అలియాస్ మిర్చి బాబాను బరిలోకి దింపింది. కాంగ్రెస్ పాలనలో ఒక వెలుగు వెలిగిన మిర్చి బాబా ఇంతకుముందు దిగ్విజయ్ సింగ్ గెలుపు కోసం హోమం చేశారు. ఆయన ఓడితే ఆత్మహత్య చేసుకుంటానని ప్రతిజ్ఞ చేశారు. దిగ్విజయ్ ఓడిపోవడంతో ఆత్మహత్యకు సిద్ధపడటం అప్పట్లో సంచలనం సృష్టించింది.

## రాజస్థాన్ కాంగ్రెస్‌కు గట్టి షాక్

**బీజేపీలో చేరిన సచిన్ పైలట్ వర్గీయులు**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ) : రాజస్థాన్ శాసన సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీకి ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ తమను పక్కన పడేశారని, కించపరిచే రాజకీయాలు చేస్తున్నారని ఆరోపిస్తూ కొందరు నేతలు ఆ పార్టీని వీడుతున్నారు. సచిన్ పైలట్ వర్గానికి చెందిన జ్యోతి ఖండేల్‌వాల్ శనివారం ఆ పార్టీని వీడి, బీజేపీలో చేరారు. ఆమెతో పాటు కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యేలు చంద్రశేఖర్ బెయిద్, నందలాల్ పూనియా, మాజీ ఐపీఎస్ అధికారులు కేసర్ సింగ్ షెఖావత్, భీమ్ సింగ్, ఇతర నేతలు డా.హరిసింగ్ సారన్, ఝుంఝునూ, సావర్ లాల్ మహరియా కూడా బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. జ్యోతి మాట్లాడుతూ, నిజాయితీపరులను, కాంగ్రెస్ కోసం అంకితభావంతో పని చేసినవారిని ఆ పార్టీ హైకమాండ్ కూడా పట్టించుకోలేదన్నారు. యువ నేత సచిన్ పైలట్, సీఎం అశోక్ గెహ్లాట్ మధ్య విభేదాలు కొనసాగుతుండటం కాంగ్రెస్ విజయావకాశాలను దెబ్బతీస్తుందని విశ్లేషకులు చెప్తున్నారు.

# మహారాష్ట్రలో భారీ అవినీతి!

- కార్మికుల మధ్యాహ్న భోజనంలో కుంభకోణం
- చేతులు మారిన కోట్లాది రూపాయలు
- పథకాన్ని నిలిపివేస్తున్నట్టు ప్రభుత్వం వెల్లడి




హైదరాబాద్, అక్టోబరు 28 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలో భారీ కుంభకోణం వెలుగు చూసింది. భవన నిర్మాణ కార్మికుల కోసం ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్టు సమాచారం. దీంతో వచ్చే నెల నుంచి ఈ పథకాన్ని నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కరోనా సమయంలో భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవడానికి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. మహారాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి వద్ద ఉన్న రూ.16,000 కోట్ల నిధుల్లో కొంతమేర ఉపయోగించుకుంటూ పథకాన్ని కొనసాగించారు. అయితే ప్రతి నెలా 7 నుంచి 8 లక్షల మంది కార్మికులకు భోజనాలు పెట్టినట్టు లెక్కల్లో చూపారు. కరోనా సద్దుమణిగే నాటికి రూ.2,500 కోట్లు ఖర్చు అయినట్టు లెక్కల్లో వెల్లడించారు.

**అన్నీ తప్పుడు లెక్కలే**

ఒక్క జల్గాం జిల్లాలోనే 70 వేల మంది కార్మికులకు భోజనాలు పెట్టినట్టు లెక్కల్లో చూపి రూ.24 కోట్లు తీసుకున్నారు. భోజనాలు చేసిన వారిలో 80 ఏండ్ల ముసలోళ్లు కూడా ఉన్నారు. ధారా శివ్ జిల్లాలో పేరు నమోదు చేసుకున్న కార్మికులు 7,915 మంది కాగా 35,216 మందికి భోజనాలు పంపిణీ చేసినట్టు లెక్కల్లో చూపారు. భోజనాల పంపిణీ కాంట్రాక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ఈ కుంభకోణానికి పాల్పడినట్టు తెలుస్తున్నది. పథకంలో అవినీతిపై ఎన్సీపీ ఎమ్మెల్యే ఏక్‌నాథ్ ఖడ్సే విధాన పరిషత్‌లో ప్రశ్నించారు. ఇదే సమయంలో ప్రతిపక్ష నేతలు విజయ్ వడెట్టివార్, నానా పటోలే, అనిల్ దేశ్‌ముఖ్‌లు కూడా ప్రభుత్వాన్ని నిలదీశారు. దీంతో స్పందించిన కార్మిక శాఖ మంత్రి సురేశ్ ఖడ్సే ఓ కమిటీని ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం నవంబర్ 1 నుంచి ఈ పథకాన్ని నిలిపివేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది.



## గుజరాత్‌లో నకిలీ ఆఫీస్‌తో మోసం

*ఛోటా ఉదేపూర్: గుజరాత్‌లో ఓ నకిలీ ఆఫీస్ ఏర్పాటు చేసి,రూ.4.16 కోట్ల ప్రభుత్వ నిధులు స్వాహా చేసిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. సందీప్, అబు బకర్ సయ్యద్‌ను అదుపులోకి తీసుకొన్నట్టు పోలీసులు శనివారం వెల్లడించారు. బోగస్ ప్రాజెక్టులకు ప్రభుత్వ నిధులు పొందేందుకు బొదేలీ పట్టణంలో సందీప్ ఇరిగేషన్ ప్రాజెక్టు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పేరుతో 2021లో నకిలీ కార్యాలయం ఏర్పాటు చేశాడు. అతడి ప్రతిపాదనలకు ఆమోదం తెలిపిన అధికారులు నిధులు విడుదల చేశారు. తర్వాత పలు ప్రాజెక్టులకు రూ.3.75 కోట్లు కోరుతూ సదరు ఫేక్ ఆఫీస్ నుంచి వచ్చిన ప్రతిపాదనలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టగా.. ఈ మోసం వెలుగులోకి వచ్చింది.*

# గాజాపై దాడులు విస్తృతం

- సంపూర్ణ బలంతో ఎదుర్కొంటామన్న హమాస్
- ఐక్యరాజ్యసమితిలో గాజాపై ఓటింగ్‌కు భారత్ గైర్హాజరు



గాజాపై కాల్పులు జరుపుతున్న ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు

జెరూసలేం: గాజాలో భూతల దాడులను మరింత తీవ్రం చేస్తామని ఇజ్రాయెల్ సైన్యం శనివారం ప్రకటించింది. హమాస్ ఉగ్రవాదుల సొరంగాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలపై విరుచుకుపడతామని తెలిపింది. ఉత్తర గాజాలో 150 సొరంగాలు, బంకర్లను ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు ధ్వంసం చేశాయి. కమ్యూనికేషన్ల వ్యవస్థపై కూడా దాడులు చేయడంతో దాదాపు 23 లక్షల మంది ప్రజలు బయటి ప్రపంచంతో సంబంధాలను కోల్పోయారు. శాటిలైట్ ఫోన్లు మాత్రమే పని చేస్తున్నాయి. ఇజ్రాయెల్ దాడులను సంపూర్ణ శక్తి సామర్థ్యాలతో ఎదుర్కొంటామని హమాస్ తెలిపింది. కాగా, ఇజ్రాయెల్-హమాస్ యుద్ధాన్ని తక్షణమే ఆపాలని పిలుపునిస్తూ ఐక్యరాజ్య సమితి సాధారణ సభ శనివారం ఓ తీర్మానాన్ని ఆమోదించింది. తీర్మానానికి అనుకూలంగా 120 దేశాలు, వ్యతిరేకంగా 14 దేశాలు ఓటు వేశాయి. భారత్ సహా 45 దేశాలు ఓటింగ్‌కు గైర్హాజరయ్యాయి. ఐరాస భద్రతా మండలిలో భారత్ ప్రతినిధి మాట్లాడుతూ ఇజ్రాయెల్‌పై హమాస్ దాడిని తప్పనిసరిగా ఖండించాలని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా స్పష్టమైన సందేశం ఉండాలని తెలిపారు. ఈ తీర్మానంలో వీటి ప్రస్తావన లేదన్నారు. ఐరాసలో భారత్ వైఖరిని ప్రతిపక్ష పార్టీలు ఖండించాయి.

**హమాస్ వైమానిక దళాధిపతి హతం!**

శుక్రవారం రాత్రి జరిపిన వైమానిక దాడుల్లో హమాస్ వైమానిక దళాధిపతి ఇస్సామ్ అబూ రుక్బే హతమయ్యాడని ఇజ్రాయెల్ సైన్యం శనివారం ప్రకటించింది.



## యూఏఈ వెళ్తుంటే ఇవి తీసుకెళ్లలేరు

*ముంబై : యూఏఈ తదితర గల్ఫ్ దేశాలకు వెళ్లేవారికి చేదు వార్త! భారతీయ రుచులను ఆస్వాదించాలనే కోరికతో పచ్చళ్లు, నెయ్యి వంటి వాటిని తీసుకెళ్లడంపై విమాన ప్రయాణాల్లో నిషేధం ఉంది. విమానయానంలో వెంట తీసుకెళ్లకూడని నిషేధిత వస్తువులపై అవగాహన లేకపోవడంతో ప్రయాణికుల బ్యాగేజీలను తిరస్కరిస్తున్నారు. పండుగల సీజన్ వస్తుండటంతో నిషేధిత వస్తువులపై ప్రయాణికులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఎండు కొబ్బరి, పెయింట్, కర్పూరం, నెయ్యి, పచ్చళ్లు, నూనెతో తయారు చేసిన తినుబండారాలు, బాణసంచా, ఈ-సిగరెట్లు, లైటర్స్, పవర్ బ్యాంక్స్, స్ప్రే బాటిల్స్ వంటివాటిని తీసుకెళ్లకూడదని చెప్తున్నారు.*



## రాయల్ బేబీకి 157 అక్షరాలతో పేరు!

*న్యూఢిల్లీ: అమ్మ, అమ్మమ్మ, తండ్రి, మేనమామ..ఇలా రక్త సంబంధీకులను గుర్తు చేసుకుంటూ స్పెయిన్‌లోని ఓ రాకుమారుడు తన బిడ్డకు నామకరణం చేశాడు. ఆ తమ మత విశ్వాసాల్ని తెలిపే పదాల్ని కూడా చేర్చాడు. దీంతో ఆ రాయల్ బేబీ పేరు 25 పదాలు, 157 అక్షరాలతో తయారైంది. స్పెయిన్‌లోని ఆల్బా రాజ్య రాకుమారుడు డ్యూక్ ఫెర్నాండో ఫిట్జ్-జేమ్స్ స్టువార్ట్, సోఫియా పలాజులో దంపతులకు ఈ ఏడాది జనవరిలో బిడ్డ జన్మించింది. ఆ బిడ్డకు 'సోఫియా ఫెర్నాండ డోలోరెస్ కయేంటానా టెరిసా ఆంజిలా డి లా క్రూజ్ మికాలా డెల్ సాంటిసిమో సక్రమెంటో డెల్ పెర్పుటూ సోకోరో డి లా సాంటిసిమా ట్రినిడాడ్ డి టోడోస్‌లాస్ సాంటోస్' అని పేరు పెట్టారు.*